భూసార పరీక్షలు తప్పనిసరి

కీసర: రైతులు తమ పొలాల్లో తప్పకుండా తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని కీసర మండల వ్యవసాయాధికారి మాధవీలత అన్నారు. బుధవారం యాద్గార్‌పల్లి గ్రామంలోని రైతు వేదిక వద్ద యాద్గార్‌పల్లి గ్రామ రైతులకు మట్టినమునా సేకరణ, పరీక్షలపై అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ ఎస్‌హెచ్‌సీ, ఆర్‌కేవీవై పథకం కింద మేడ్చల్‌ జిల్లాలో కీసర మండలం ఎంపిక చేయడం జరిగిందని, మండలంలో మొత్తం 2736 శాంపిల్స్‌ తీసుకోవాలని నిర్ణయించడం జరిగిందన్నారు. మొదటి విడతలో 25 శాతం నమునాలు అంటే 684 నమునాలు సేకరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకోసం రైతుల పొలాల్లో మట్టి నమునాలను ఏఈఓ , ఎస్‌హెచ్‌సీ ఏపీపీ ద్వారా సేకరించి మేడ్చల్‌లోని ల్యాబ్‌కు పంపి పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్ష ఫలితాలను కార్డు



మట్టి నమూనా సేకరణపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి మాధవీలత

ద్వారా రైతులకు అందజేయడం జరుగుతుందని ఈ కార్డును అనుసరించి రైతులు తమ పొలంలో యేపంటుల సాగుచేస్తే బాగుటుంది, ఏ ఎరువులు వాడాల్సి ఉంటుందని తదితర అంశాలను కార్డులో నమోదు చేస్తామన్నారు.కార్యక్రమంలో మేడ్చల్‌లోని ల్యాబ్‌కు సంబందించిన వ్యవసాయాధికారి ఈసియా బేగమ్‌, వ్యవసాయ విస్తరణ అధికారి వందన ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మేడ్చల్‌: సికిల్‌సెల్‌ అవేమియా వ్యాధీ నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ పట్టణంలోని ఎస్టీ వసతి గృహం విద్యార్థులు బుధవారం మేడ్చల్‌ లో ర్యాలీ నిర్వహించారు. హాస్టల్‌ నుండి జాతీయ రహదారి ఉన్న అంబేడ్కర్‌ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది.సికిల్‌సెల్‌ అవేమియా, తలసేమియా వ్యాధుల నిర్మూలన కోసం విద్యార్థుల చే అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యాధి నిర్మూలన సైదా తెలిపారు. ర్యాలీలో అధికారులు వినోద్‌కుమార్‌, రవిందర్‌, తిరుపతి, సుభాన్‌, వెరోనికా, సుదర్శన్‌ తదితరులు పాల్గొన్నారు.

కాశీలో పూజకు 40వేల శివలింగాల తయారీ

మేడ్చల్‌: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాశీలో శివలింగాల పూజకు మేడ్చల్‌ అయ్యప్ప దేవాలయంలో భక్తులు 40వేల శివలింగాలను తయారు చేశారు. మే 30 నుంచి జూన్‌ 26 వరకు భక్తులు, మహిళలు నిత్యం నిష్ఠతో ఆలయంలో మట్టితో శివలింగాలను తయారు చేశారు. 28 రోజుల పాటు తయారు చేసిన 40వేల శివలింగాలను కాశీకి తరలించనున్నారు. నవంబర్‌ 4నుంచి 13 వరకు కాశీలో నిర్వహించనున్న కోటి శివలింగాల పూజా కార్యక్రమానికి ఈ లింగాలను తయారు చేసినట్లు తెలిపారు.



రైతు బీమా చెక్కు అందజేత

కీసర: అనారోగ్య కారణాలతో మృతి చెందిన రైతు కుటుంబాలను ఆదుకునేందుకు రైతు బీమా పథకం దోహదపడుతుందని మేడ్చల్‌ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. ఇటీవల అనారోగ్యతో మృతిచెందిన భోగారం గ్రామానికి చెందిన మామిడి మధుసూదన్‌రెడ్డి కి రైతు బీమా కింద మంజూరైన రూ.5 లక్షల చెక్కును బుధవారం మృతుడి కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కాంగ్రెస్‌ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఆగస్టు 15 లోగా ఒకేసారి రూ. 2 లక్షల మేర రైతు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

కాంగ్రెస్‌ గూటికి కార్పొరేటర్‌ శాలిని శ్రీకాంత్‌ గౌడ్‌

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌లో బీఆర్‌ఎస్‌ పార్టీకి షాక్‌ తగిలింది. పీర్జాదిగూడ మున్సిపల్‌ 18వ డివిజన్‌ కార్పొరేటర్‌ కుర్ర శాలిని శ్రీకాంత్‌ గౌడ్‌ బీఆర్‌ఎస్‌ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి డిప్యూటి మేయర్‌ కుర్ర శివకుమార్‌ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు మేడ్చల్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జ్‌ తోటకూర వజ్రేష్‌ యాదవ్‌, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వజ్రేష్‌ యాదవ్‌ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు.

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ శాఖ అధికారి కృష్ణారెడ్డి



సమావేశానికి హాజరైన విద్యార్థులు

జవహర్‌నగర్‌: యువత మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు పర్యవేక్షణ ఉండాలని మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా సంక్షేమ శాఖ అధికారి కృష్ణారెడ్డి అన్నారు. జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్‌ అభ్యూస్‌ అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు దూరంగా ఉండి భవిష్యత్తును కాపాడుకుందామన్నారు. మత్తు పదార్థాలు వివిధ రూపాల్లో మార్కెట్‌లోకి వస్తున్నాయని, చిన్నారులు వాటికి దూరంగా ఉంటూ ఉన్నత చదువులు చదువుకొని సమాజానికి మేలు చేయాలన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, డీపీఈవోలు నవీన్‌కుమార్‌, ఫయాజుద్దీన్‌, సీడబ్ల్యూసీ మెంబర్‌ రామ్మోహన్‌, ఎంఈవో శశిధర్‌, సీడీపీవో స్వాతి, జవహర్‌నగర్‌ ఇన్‌స్పెక్టర్‌ నాగరాజు, ఎస్‌ఐ అనిల్‌కుమార్‌యాదవ్‌, ప్రధానోపాధ్యాయులు అజమోహినుద్దీన్‌, జిల్లా, మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్‌ వేతనాలు చెల్లించాలి



సాక్షి, మేడ్చల్‌ జిల్లా: పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్‌ చేస్తూ బుధవారం కలెక్టరేట్‌ ఎదుట గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పంచాయతీ కార్మికులు ,ఉద్యోగులు డీపీఓ వెంకయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్‌ అండ్‌ వర్కర్స్‌ యూనియన్‌ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌. శ్రీనివాస్‌ మాట్లాడుతూ మల్టీ పర్పస్‌ వర్కర్‌ విధానంతో గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ట్రాక్టర్‌, ఎలక్ట్రిషన్‌ నిర్వహణలో ఎందరో కార్మికులు మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే అందజేయాలన్నారు .పంచాయతీ ఉద్యోగులు,కార్మికులందరికీ రూ. ఐదు లక్షల బీమా అమలు చేయాలన్నారు. దహన ఖ ర్చులను రూ. 10 వేల నుంచి రూ. 20వేలకు పె ంచాలన్నారు. పీఎఫ్‌, ఇఎస్‌ఐ సౌకర్యంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌ చేశారు ఈ ధర్నాలో జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణ , గ్రామపంచాయతీ జిల్లా నాయకులు సుధాకర్‌, సు గుణ, ఆరోగ్యం, లక్ష్మయ్య, కార్మికులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మేడ్చల్‌రూరల్‌: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేడ్చల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ లావణ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఘనాపూర్‌ గ్రామానికి చెందిన గుమ్మడిదల శివశంకర్‌(39)కు పదేళ్ల క్రితం సింగాయపల్లి గ్రామానికి చెందిన లతతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు సంతానం భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో ఆమె నాలుగేళ్లక్రితం పిల్లలతో సహా పుట్టింటికి వెళ్లిపోయింది. గత మంగళవారం శివశంకర్‌ పెద్ద మనుషులతో కలిసి లత పుట్టింటికి వెళ్లి కాపురానికి రావాలని కోరినా ఆమె అంగీకరించలేదు. పిల్లలను తనకు చూపించాలని వేడుకున్నా భార్య ఒప్పుకోకపోవడంతో మనస్తాపానికిలోనైన శివశంకర్‌ మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

ధరణి.. దారికొస్తోంది

- నాలుగు నెలల తర్వాత ధరణి సమస్యల పరిష్కారానికి మోక్షం
- రోజు వారీగా మండల స్థాయి నుంచి కలెక్టర్‌ వరకు పెండెన్సీ పరిశీలన
- పెండింగ్‌లో 7 వేలకు పైగా దరఖాస్తులు
- వారంలో 2 వేల దరఖాస్తుల పరిష్కారం



సాక్షి,మేడ్చల్‌ జిల్లా: దాదాపు నాలుగు నెలల తర్వాత ధరణి సమస్యల పరిష్కారానికి మోక్షం లభిస్తోంది. ఎన్నికల కోడ్‌ ముగియడంతో పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఉన్నతాధికారులు సంబంధిత శాఖ సిబ్బంది, అధికారులతో సమీక్ష నిర్వహించి క్షేత్రస్థాయి పరిస్థితిని ఆరా తీస్తున్నారు. జిల్లాలోనే అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దు వివాదాలు ఉన్నాయి. వందల ఎకరాల్లో వివాదాలు ఉండటంతో పాటు చాలా చోట్ల కొన్నింటికి రికార్డులు లేవు.దీంతో మిస్సింగ్‌ సర్వే నెంబర్లు, మ్యూటేషన్లు, కోర్టు కేసులున్న వాటిని జాగ్రత్తగా పరిశీలించి చెక్‌ లిస్టు రాయాలని ఉన్నతాధికారులు తహసీల్దార్లను ఆదేశించారు. వారం వ్యవధిలో 2 వేల దరఖాస్తులు పరిష్కారం కాగా, జిల్లాలో మరో 7,801 దరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్నాయి. పెండింగ్‌ దరఖాస్తులను పరిశీలించేందుకు ప్రతి రోజూ మండల స్థాయి నుంచి కలెక్టరేట్‌ వరకు మానిటరింగ్‌ కొనసాగుతోంది. ఎన్నికల నేపథ్యంలో గత నాలుగు నెలలుగా పోర్టల్‌లో నమోదైన ఆర్జీలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో పెండింగ్‌ దరఖాస్తుల సంఖ్య పెరిగినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అయితే ధరణి పోర్టల్‌ లో టీఎం 33కి సంబంధించి గత ప్రభుత్వం తహసీల్దార్లు, ఆర్డీవోలకు కొన్ని ఆప్షన్స్‌ ఇవ్వడంతో దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం నెలకొంది.

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో ప్రధానంగా ధరణిలో వచ్చే దరఖాస్తులు నిషేధిత భూముల జాబితాకు సంబంధించినవే ఎక్కువగా ఉంటున్నాయని రెవెన్యూ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఉదాహరణకు ఒక సర్వే నెంబరులోని ఐదెకరాల భూమిని రికార్డుల ప్రక్షాళన సందర్భంగా నిషేధిత భూముల జాబితాలో పెడితే.. అదే నంబరులో ఉన్న వందల ఎకరాలు సైతం నిషేధిత జాబితాలో చేరి క్రయవిక్రయాలకు నోచుకోవడం లేదు. ఇది పరిష్కారం కావాలంటే సంబంధిత రైతులు కలెక్టర్‌, సీసీఎల్‌ఏ వరకు వెళ్లాల్సి వస్తోంది.

మరోవైపు పట్టాదారు పాసు పుస్తకంలో పేరు తప్పుపడటం, విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, మిస్సింగ్‌ సర్వే నెంబర్లకు సైతం భారీగా అర్జీలు వచ్చాయని తెలుస్తోంది. ఇందులో ఎక్కువగా టీఎం 33కి సంబంధించినవే జిల్లాలో 3 వేల వరకు ఉన్నట్లు సమాచారం. వచ్చే నెలాఖరు వరకు అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

తహసీల్దార్ల వద్దే ఎక్కువ

జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న దరఖాస్తులు ఎక్కువగా క్షేత్రస్థాయిలోని తహసీల్దార్ల వద్దే ఉన్నాయి. ఉదాహరణకు జిల్లాలో మొత్తం 7,801 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా.. తహసీల్దార్ల వద్దే 5 వేల వరకు దరఖాస్తులున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల విధుల్లో తీరిక లేకుండా ఉండటం, అంతకుముందు బదిలీలతో పరిష్కార ప్రక్రియలో తీవ్ర జాప్యం నెలకొంది. మరికొన్ని ఆర్డీవోల లాగిన్‌ లో ఉన్నాయి. చాలా తక్కువ సంఖ్యలోనే కలెక్టర్‌ లాగిన్‌లో ఉన్నట్లు సమాచారం. దీంతో రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశం మేరకు జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ ధరణి సమస్యల పరిష్కారాన్ని ప్రాధాన్యతా అంశంగా తీసుకోవాలని తహసీల్దార్లకు సూచించారు.

టైరు పేలి ఇసుక లారీ బోల్తా

లారీ క్యాబిన్‌, ఇంజిన్‌ దగ్ధం

ఘట్‌కేసర్‌: ఘట్‌కేసర్‌–ఎదులాబాద్‌ అండర్‌పాస్‌ రోడ్డులో మంగళవారం రాత్రి టైరు పేలి ఇసుక లారీ బోల్తా పడింది. అడ్మిన్‌ ఎస్సై రామునాయక్‌ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఏటూరు నాగారం నుంచి ఇసుక లోడుతో హైదరాబాద్‌ వెళుతున్న లారీ అర్ధరాత్రి ఘట్‌కేసర్‌– ఎదులాబాద్‌ అండర్‌పాస్‌ రోడ్డు సమీపంలోకి చేరుకోగానే టైరు పేలి వంతెన పై నుంచి కిందికి పడిపోయింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌ వెంకట్‌రెడ్డి కాలు, కుడి భుజానికి గాయాలయ్యాయి. వంతెనపై నుండి కిందకు పడగానే లారీ ఇంజిన్‌లో మంటలు చెలరేగి క్యాబిన్‌ పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న పోలీసులు క్రేన్‌ సాయంతో లారీని పక్కకు తప్పించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దండోరా సభను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌

మేడ్చల్‌: ఎమ్మార్పీఎస్‌ ఆధ్వర్యంలో జూలై 7న వరంగల్‌లో నిర్వహిస్తున్న దండోరా సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్‌ కళామండలి జాతీయ అధ్యక్షుడు ఎస్‌వై అశోక్‌ , రాంచందర్‌ మాదిగ అన్నారు. బుధవారం మేడ్చల్‌లో నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్‌ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జులై 7న మాదిగల ఆత్మగౌరవ కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరంగల్‌లో నిర్వహిస్తున్న కవాతుకు మాదిగలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.సమావేశంలో మండల అధ్యక్షులు పరుశరాం మాదిగ నాయకులు బాలనర్సింహ్మా, శంకర్‌, రవి తదితరులు పాల్గొన్నారు.

విదార్థులకు పుస్తకాల పంపిణీ



పోచారం: పోచారంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎస్‌వైఆర్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ సామల యాదిరెడ్డి బుధవారం పుస్తకాలు, పెన్సిల్‌ బాక్సులను పంపిణీ చేశారు. తొలుత పాఠశాలలోని సరస్వతి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం అదే ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రానికి స్మార్ట్‌ టీవీని బహూకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించి, విద్యార్థులతో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సహకార బ్యాంకు వైస్‌ చైర్మన్‌ బద్దం అనంతరెడ్డి, కౌన్సిలర్‌ మెట్టు బాల్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌ ఆకిటి బాల్‌రెడ్డి, ఫౌండేషన్‌ ప్రధాన కార్యదర్శి సామల సందీప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సామల లక్ష్మణ్‌రెడ్డి, నాయకులు కొండల్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మల్లేష్‌, తిరుమల్‌ రెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారులను ధ్వంసం చేయొద్దు



సమావేశంలో పాల్గొన్న మున్సిపల్‌ చైర్మన్‌ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలో వాటర్‌లైన్‌, ఇంటి నల్ల కనెక్షన్లు ఇచ్చేసమయంలో కాలనీలోని సీసీరోడ్లు , బీ.టీ.రోడ్లు పాడవకుండా హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ అధికారులు, మున్సిపల్‌ వాటర్‌ లైన్‌మెన్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని నాగారం మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్‌ కార్యాలయంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ అధికారులు, వాటర్‌ లైన్‌మెన్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్‌ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజలకు అవసరాల మేరకు మంచినీటి సరఫరా చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన వాటికి మంచి నీటి నల్లా కనెక్షన్లు వేసే సమయంలో రహదారులను తవ్వి పనులు చేపడితే రహదారులు దెబ్బతింటాయన్నారు. సీసీరోడ్డు , బీటీరోడ్లు పాడవ్వకుండా ఇళ్లకు మంచినీటి నల్లా కనెక్షన్లు ఇవ్వాలన్నారు. ఇందుకోసం ఏ కాలనీల్లో మంచీనీటి పైప్‌లైన్‌ ఎక్కడనుండి ఏ కాలనీకి వెళ్లిందో నల్లా కనెక్షన్లు ఇచ్చే సిబ్బందికి పూర్తిగా అవగహన కలిగిఉండాలన్నారు. దీనికి తోడు కొత్తగా పైప్‌లైన్‌పనులు చేపట్టే కాలనీల్లోనూ ప్రస్తుతం ఉన్న సీసీరోడ్లు, బీ.టి.రోడ్లు పాడవ్వకుండా పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో మున్సిపల్‌ కమిషనర్‌ రాజేంద్రకుమార్‌ ,డిజిఎం నాగరాజు, మున్సిపల్‌ డిఈఈ సుదర్శనరఘు, మున్సిపల్‌ మేనేజర్‌చంద్రశేఖర్‌, హెచ్‌ఎండబ్లూఎస్‌ మేనేజర్‌సతీష్‌, సానిటరీఇన్స్‌పెక్టర్‌ రాంరెడ్డి, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, వాటర్‌మెన్స్‌ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సాక్షి, మేడ్చల్‌ జిల్లా: మున్సిపాలిటీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రూ.21వేల వేతనాన్ని అమలు చేయటంతోపాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్‌ డిమాండ్‌ చేశారు. బుధవారం కలెక్టర్‌ ఆఫీస్‌ ఎదుట తెలంగాణ మున్సిపల్‌ కార్మిక యూనియన్‌ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. మున్సిపల్‌ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌, ఎన్‌ఎంఆర్‌, ఫిక్స్‌డ్‌పే తదితర పద్ధతుల్లో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్‌. శ్రీనివాస్‌ మాట్లాడుతూ ము న్సిపల్‌ కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సత్య నారాయణ, లింగస్వామి, ఉన్నికృష్ణన్‌, ఫి ర్జాదిగూడ మున్సిపల్‌ నేతలు సోమయ్య, స్వప్న, యూనియన్‌ నాయకులు బాలనరసింహ, ఎల్లయ్య , సూరి, మహేశ్‌, సురేష్‌, మధు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌ ఎదుట ఆందోళన చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కార్పొరేట్‌ దోపిడీకి అడ్డుకట్ట వేయాలి

సాక్షి,మేడ్చల్‌ జిల్లా: మేడ్చల్‌ మల్కాజిగిరి జిల్లాలో కార్పొరేట్‌, ప్రైవేట్‌ కాలేజీల్లో ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని, ఫీజుల నియంత్రణ చట్టం చేయాలని డిమాండ్‌ చేస్తూ బుధవారం డీఐఈఓ కార్యాలయం ఎదుట భారత విద్యార్థి ఫెడరేషన్‌(ఎస్‌ఎఫ్‌ఐ)జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించినట్లుగా కాలేజీ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌ పంపిణీ చేయడంతోపాటు కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని నినాదాలు చేశారు. రీ– వెరిఫికేషన్‌ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఉచితంగా వెరిఫికేషన్‌ చేసి, మార్కులను తప్పులు లేకుండా ప్రకటించాలని కోరారు. మధ్యాహ్నం భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఐఈఓ కిషన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్‌,రాథోడ్‌ సంతోష్‌ మాట్లాడుతూ కార్పొరేట్‌ విద్యాసంస్థలు అకాడమీల పేరుతో ఒకే క్యాంపస్‌లో హాస్టళ్లు, కాలేజీలు నడుపుతూ రూ.లక్షలు వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే కార్పొరేట్‌ కళాశాలల ఫీజుల దందాను నియంత్రించాలని డిమాండ్‌ చేశారు. ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ఖాళీగా ఉన్న లెక్చరర్‌ పోస్టులు భర్తీ చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు అరుణ్‌, అవినాష్‌, శ్యామ్‌రావు, రఘు, సాయి,అజయ్‌, మిట్టు, సుబ్బు, నిఖిల్‌, నితీష్‌,శివ, చందు, దినేష్‌ పాల్గొన్నారు.

సమన్వయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

అల్వాల్‌: నేరేడ్‌మెట్‌ డివిజన్‌లోని ఆర్‌కెపురం ఫ్లైఓవర్‌ మరమ్మతులు, సమాంతర ఫ్లై ఓవర్‌ నిర్మాణానికి రైల్వే, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన రైల్వే, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఫ్లైఓవర్‌ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైల్వే అధికారులు, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, వీలైనంత త్వరగా సమాంతర ఫ్లైఓవర్‌ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైల్వే అధికారి సుధాకర్‌, జీహెచ్‌ఎంసీ ఈఈ రాజు, డీఈ రేణుక, కార్పొరేటర్‌ మీనాఉపేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకులు జీకె. హన్మంతరావు, రా వుల అంజయ్య, చిందం శ్రీనివాస్‌, మేకల రా ముయాదవ్‌, జీపీసీ వెంకన్న, శోభారాణి, రమాదేవి, శ్యామ్‌, పాపిరెడ్డి, సర్వేష్‌ యాదవ్‌, సాయి, శివ, బాలకృష్ణ, శంకర్‌రావు, నరేష్‌, రాజేష్‌, రవీంద్ర, నవీన్‌, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫీజులకు అడ్డుకట్ట వేయాలి



మాట్లాడుతున్న శ్యామ్‌కిరణ్‌

ఘట్‌కేసర్‌: ప్రభుత్వ బడుల్లో కనీస వసతులు కల్పించాలని, ప్రైవేటు కార్పొరేట్‌ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యులు అంకం శ్యామ్‌కిరణ్‌ అన్నారు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ ఏబీవీపీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం చేపట్టిన బంద్‌ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని పాఠశాలలను మూసివేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్‌, టై బెల్ట్‌లు విక్రయిస్తే వ్యాపార కేంద్రాలుగా మార్చారన్నారు. ఖాళీగా ఉన్న డీఈఓ, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని, విద్యాహక్కు చట్ట ప్రచారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలన్నారు. గుర్తింపు లేని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. లేని పక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ స్టేట్‌ టెక్‌సెల్‌ కన్వీనర్‌ సచిన్‌, ఎగ్జిక్యూటివ్‌ భాను, ఆధిత్య, రఘు, అభి, కిరణ్‌కుమార్‌, పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ సైదులు, అడ్మిన్‌ ఎస్సై రామునాయక్‌

ఘట్‌కేసర్‌: విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని సీఐ సైదులు అన్నారు. ఘట్‌కేసర్‌ పట్టణంలోని యంనంపేట్‌ చౌరస్తాలో బుధవారం అంతర్జాతీయ డ్రగ్స్‌ నివారణ దినోత్సవం సందర్భంగా కొండాపూర్‌ విజ్ఞాన్‌ ఇంజినీరింగ్‌ విద్యార్థుల ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా యంనంపేట్‌ చౌరస్తా నుంచి శివారెడ్డిగూడ వరకు ర్యాలీ నిర్వహించి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి. మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితంలో రాణించలేరన్నారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, అధ్యాపకులు, తల్లితండ్రులు చూపిన మార్గంలో పయనించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విజ్ఞాన్‌ మహిళా కళాశాల కోఆర్డినేటర్‌ శ్రీలత, కోటేశ్వర్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు జోలికి వెళ్లొద్దు..

మేడిపల్లి: విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటుపడి బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని మేడిపల్లి సీఐ గోవింద్‌ రెడ్డి అన్నారు. బుధవారం మత్తు పానీయాలను తీసుకోవద్దని విద్యార్థులతో ప్రమాణం చేయించారు.అనంతరం విద్యార్థులు, పోలీసులు ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ యువత చెడు వ్యసనాలకు అలవాటుపడి జైలు పాలవుతున్నారన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఇతరులకు ఆదర్శం కావాలన్నారు.

విద్యార్థుల అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మేడ్చల్‌రూరల్‌: అంతర్జాతీయ డ్రగ్స్‌ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని పూడూర్‌ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించా రు. డ్రగ్స్‌ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చే యాలని ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సొంత నిధులతో డ్రైనేజీ మరమ్మతులు



కీసర: కీసర నందిని‌నగర్‌కాలనీలో డ్రైనేజీ పైపులైన్‌ పగిలి మురుగునీరు బయటికి వస్తుండటంతో కీసర మాజీ ఎంపీటీసీ స భ్యుడు బెలిదేరమే ష్‌గుప్తా తన సొంత నిధులతోబుధవారం డ్రైనేజీ పైప్‌లైన్‌ పనులకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తన సొంతత నిధులతో ప్రజలకు ఉపయోగపడే పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. డ్రైనేజీ పైప్‌లైన్‌ మరమ్మతు పనులు చేపట్టిన రమేష్‌గుప్తాను కాలనీవాసులు అభినందించారు.